సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 29 । జూన్ । 2023



నేడు బక్రీద్ పర్వదినం

జిల్లా వ్యాప్తంగా గురువారం బక్రీద్ పర్వదినం ఘనంగా నిర్వహించుకోనున్నారు. త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ జరుపుకుంటారు. ఇప్పటికే కడప నగరం బిల్టప్ వద్ద నున్న ఈద్గాతో పాటు అన్ని ఈద్గాలలో, మసీదులలో ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు బక్రీద్, తొలి ఏకాదశి శుభాకాంక్షలు



కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్/పులివెందుల: మత సామరస్యానికి ప్రతీక అయిన బక్రీద్, తొలి ఏకాదశి సందర్భంగా జిల్లా ప్రజలకు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదినం, హిందువులకు తొలి ఏకాదశి పండుగలు అత్యంత భక్తి, ప్రీతికరమైనవన్నారు. ఒకే రోజు రెండు పండుగలు రావడం విశేషమన్నారు. ప్రశాంతంగా పండు గలు నిర్వహించుకోవాలన్నారు.

● బక్రీద్, తొలి ఏకాదశి పర్వదినాల సందర్భంగా జిల్లా ప్రజలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ విజయ రామరాజు, ఎస్పీ అన్బురాజన్ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా కేజీబీవీలలో టీచింగ్ ఫ్యాకల్టీకి సంబంధించి గురు, శుక్రవారాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 131 పోస్టులకు సర్టిఫికెట్లు పరిశీలన చేసి 1:3 నిష్పత్తిలో అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. కడపలోని మున్సిపల్ హైస్కూల్ గాంధీనగర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, అభ్యర్థులకు ఇప్పటికే ఫోన్ ద్వారా తెలియజేశామన్నారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు. ఈ నియామకాలన్నీ మెరిట్ ప్రాతిపదికన పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు వరం.. అమ్మ ఒడి

- 1,80,203 మంది తల్లుల ఖాతాల్లోకి రూ. 270.30 కోట్లు
- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- డిప్యూటీ సీఎం అంజద్‌బాష



విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జగనన్న అమ్మ ఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి అమ్మ ఒడి పథకం కింద 2022–23 సంవత్సరానికి సంబంధించి వరుసగా నాల్గవసారి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నగదును జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ సభా భవనంలో డిప్యూటీ సీఎం, ప్రజాప్రతినిధులు, అధికారులు, వందలాది మంది విద్యార్థులు, వారి తల్లులు వీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాష మాట్లాడుతూ పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు జగన్ తన పాదయాత్రలో గమనించారని తెలిపారు. అధికారంలోకి రాగానే అమ్మ ఒడి పేరుతో యేటా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 15 వేలు చొప్పున జమ చేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరి తలరాతనైనా మార్చే శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉందని నమ్మిన ముఖ్యమంత్రి ఈ మహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క చిన్నారి చదువులకు దూరం కాకూడదని ఈ పథకానికి రూపకల్పన చేశారని తెలిపారు. జిల్లాలో 1,80,203 మంది తల్లుల ఖాతాల్లోకి రూ. 2,70,30,000 జమ అవుతుందని వివరించారు. ఉన్నత చదువులకు, విదేశీ చదువులకు కూడా ప్రభుత్వం చేయూత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరారు.

● బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ 2019కి ముందు, ఇప్పుడు పోల్చి చూస్తే రాష్ట్రంలో డ్రాపౌట్స్ తగ్గారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ బాగా పెరిగిందని తెలిపారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి డిజిటల్ బోర్డుల ద్వారా విద్యను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రిదేనన్నారు. వసతి, విద్యా దీవెన పథకాలతో ఉన్నత చదువులకు వెళ్లేందుకు ప్రోత్సాహం కల్పిస్తున్నారన్నారు. విదేశీ విద్యా దీవెన సైతం అందిస్తున్నామన్నారు.

● కార్యక్రమంలో నగర మేయర్ సురేష్‌బాబు, కలెక్టర్ విజయరామరాజు, జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, ఏపీ నగర కార్పొరేషన్ చైర్ పర్సన్ జి.రమణమ్మ, ఏపీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, కార్పొరేటర్లు సూర్యనారాయణరావు, షఫీ, డీఈఓ రాఘవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా



నా కూతురు జాహ్నవి కడప జయ నగర్ కాలనీ బాలికల హైస్కూలులో ఆరవ తరగతి చదువు తోంది. గత ప్రభుత్వాలు ఉచితంగా విద్య, పుస్తకాలు మాత్రమే అందించాయి. జగనన్న ప్రభుత్వం అవసరమైన ఆర్థికసాయం, విద్యా సామాగ్రి అందించడం మా అదృష్టంగా భావిస్తున్నాం.
– అనిత, బుద్దాయపల్లె

జగన్ సారే ఎప్పటికీ సీఎంగా ఉండాలి



నా కుమార్తె యశోద అంజలీదేవి జెడ్పీ గరల్స్ హైస్కూలులో 8వ తరగతి చదువుతోంది. నేనే కుటుంబానికి ఆధారం. ప్రభుత్వం నుంచి నాకు అన్ని పథకాలు అందుతుండడంతో ఇద్దరు పిల్లలను బాగా చదివిస్తున్నాను. ఆర్థికసాయంతోపాటు పిల్లల చదువుకు అవసరమైన అన్ని వస్తువులను ప్రభుత్వమే అందిస్తోంది. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న జగన్ సారే ఎప్పటికీ సీఎంగా ఉండాలి.
– వెంకటలక్ష్మి, చిన్నచౌకు, కడప

ఏ సీఎం ఇంత గొప్ప చేయలేదు



మా బాబు ప్రేమ్ కుమార్. హౌసింగ్ బోర్డు కాలనీలోని నారాయణ స్కూలులో 8వ తరగతి చదువుతున్నాడు. ఇంటికి పెద్దదిక్కుగా నేను ప్రైవేటు ఉద్యోగం చేస్తూ పిల్లలను పోషించుకుంటున్నాను. ప్రైవేటు స్కూలులో చదువుతున్నప్పటికీ మాకు జగనన్న అమ్మ ఒడి ద్వారా ఆర్థిక సాయం అందుతోంది. మిగతా ప్రభుత్వ పథకాలు కూడా మా కుటుంబానికి అందుతున్నాయి. ఇలాంటి గొప్ప పని గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదు.
– శివమ్మ, కడప

సీఎంకు ధన్యవాదాలు



మా పాప శ్రీ మైత్రి జయ నగర్ కాలనీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. పేద విద్యార్థులకు అధునాతన విద్యా వసతులు కల్పిస్తున్న ముఖ్యమంత్రికి రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థితోపాటు మా తల్లిదండ్రులమంతా రుణపడి ఉన్నాం. మా పాప ఇంగ్లీషు కూడా చక్కగా నేర్చుకుంటోంది. విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.
– మల్లీశ్వరి, కడప

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జులై మొదటి వారంలో మూడు లేదా నాలుగు రోజులు జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని, అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ అన్బురాజన్, జేసీ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఎఫ్ఓ సందీప్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటన కోసం జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. జులై మొదటి వారంలో కడప, ఇడుపులపాయ, కొప్పర్తి, పులివెందుల, గండికోటలో ముఖ్యమంత్రి పర్యటిస్తారన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికబద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో ప్రోటోకాల్ పాటించాలన్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకట రమణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పల్లెవించిన ప్రగతిరాగం

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి నడుంబిగించింది. నవరత్న పథకాల అమలుతో పేదల జీవితాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. విద్యా రంగంలో అమ్మ ఒడి .. విద్యార్థులందరికీ వరంలా మారింది. ఏటా రైతు భరోసా కింద అన్నదాతలకు పెట్టుబడి సాయం అందజేస్తూ రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆర్‌బీకేలను ప్రత్యేకంగా తీర్చిదిద్ది అన్నదాతలు మురిసేలా విశేష సేవలందిస్తోంది. ఇక.. అవ్వాతాతలు మెచ్చేలా వృద్ధాప్య పింఛన్ అందజేస్తూ పండుటాకుల జీవితాలకు భరోసా ఇస్తోంది. వితంతు.. వికలాంగ పింఛన్లు అందజేస్తూ ఆసరాగా నిలుస్తోంది. పేదలందరికీ కులమతాలకు అతీతంగా సొంతింటి కలను సాకారం చేసింది. ఆరోగ్య శ్రీ తో మెరుగైన వైద్య సేవలు అందిస్తూనే.. మరో వైపు పల్లెల లోగిళ్లలో ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో వైద్యం అందజేస్తోంది. ప్రభుత్వ కృషితో పల్లెపల్లెనా ప్రగతి రాగం వినిపిస్తోంది.
- కడప డెస్క్



ఇతని పేరు కర్రెడ్ల ప్రసాద్. గోపవరం మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న కాలువకట్టలో నివాసం ఉంటున్నాడు. ఈయన తల్లి వెంకటసుబ్బమ్మ గృహిణిగా ఉండగా, తండ్రి వెంకటన్న ఎద్దుల బండి ఏర్పాటు చేసుకుని ఇసుక తోలకంపై జీవనం సాగిస్తున్నాడు. ఇంత వరకు బాడుగ ఇంటిలో ఉన్న వీరికి బొల్లవరం జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు కాగా నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం ఇల్లు తుదిమెరుగులు దిద్దుకొంటోంది. ఈనెలాఖరులో ఇంటిలో తాము చేరుతామని ఈ సందర్భంగా ప్రసాద్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. సొంతింటి కల నెరవేరుతున్నందుకు చెప్పలేనంత సంతోషంగా ఉందన్నారు.



గుర్రంకొండ: రైతులకు సబ్సిడీ ఎరువులు పంపిణీ చేస్తున్న ఆర్బీకే సిబ్బంది (ఫైల్)



ఈమె పేరు భారతి. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం మద్దినాయునిపల్లెలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు షుగర్ వుంది. గతంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేది. ప్రస్తుతం 104 ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఆమె ఉన్న పల్లెలోనే వైద్యులు పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారు. 'వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి తేవడంతో మాలాంటి వారికి ఎంతో మేలు చేకూరింది. పేదలంతా ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నారని' భారతి అంటోంది.



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పప్పనబోయిన వెంకట సుబ్బమ్మ. ఈమెది కమలాపురం మండలం ఎర్రగుడిపాడు గ్రామం . ఆమె భర్త వెంకట సుబ్బయ్య 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. కూలీ పనులకు వెళ్లి ముగ్గురు కూతుర్లను పెంచి పెద్ద చేసింది. పెద్దకూతురుకు వివాహం కూడా చేసింది. అయితే జగనన్న వచ్చిన తర్వాత వితంతు పింఛన్ పెంచి ఇవ్వడంతో కొంత ఉపశమనం కలిగింది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18750 వస్తోంది. అలాగే తన కూతురుకు టైలరింగ్ ద్వారా ఏటా రూ.10వేలు వస్తోంది. ఈ పథకాలన్నీ రావడంతో మా కుటుంబం సంతోషంగా జీవనం సాగిస్తోందని వెంకట సుబ్బమ్మ చెబుతోంది.



ఈమె పేరు నాగరత్న. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలంలోని గొగ్గువారి పల్లెలో ఉంటోంది. ఈమె కుమారుడు బొగ్గువారిపల్లె ప్రభుత్వ పాఠశాలలో 5 వ తరగతి చదువుతున్నాడు. ఆమె కూలి పనులు చేసుకుంటూ కొడుకును చదివిస్తోంది. అమ్మ ఒడి పథకం కింద ప్రతి సంవత్సరం రూ.15000 అకౌంట్‌లో జమ చేశారు. 'మా అబ్బాయి చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది.. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటామని' నాగరత్న అంటోంది.



కడప నగరం మోచంపేటలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్స తీసుకుంటున్న ఈమె పేరు జి. సరోజ. ఈమె గర్భిణీ. స్థానికంగానే నివాసముంటున్న ఈమె ప్రతి 15రోజులకోసారి రక్తహీనత పరీక్షలు చేసుకుంటుంది. వైద్యులు కూడా ఆమెకు దగ్గరుండి పరీక్షలు చేసి ఎప్పటికప్పుడూ సలహాలతో పాటు మందులూ అందజేస్తుంటారు. దగ్గర్లోనే ఆస్పత్రి ఉండడంతో తనలాంటి రక్తహీనత గర్భిణులెందరికో చాలా ఉపయోగకరంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తోంది. పైగా ఈ ప్రభుత్వంలో మందులకూ ఎలాంటి కొరత లేదని.. వైద్యులు కూడా దగ్గరుండి మంచి వైద్య సేవలందిస్తున్నారని తెలిపింది.



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు సుధాకర్‌రెడ్డి. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని మొరంపల్లెలో ఉంటున్నాడు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రైతు భరోసా సాయం అందుకుంటూ పంటలు సాగు చేసుకుంటున్నాడు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 'ఇది రైతు ప్రభుత్వం' అని అన్నదాతలంతా కొనియాడుతున్నాడు.

వైఎస్సార్ చలువతోనే గండికోటకు కృష్ణాజలాలు

- రూ.6 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం
- నీటిని విడుదల చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి , ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎత్తిపోతల ద్వారా చెరువులోకి ప్రవహిస్తున్న కృష్ణా జలాలను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు: వైఎస్సార్ చలువ, ఘనత వల్లే ఎంతో దూరంలో వున్న కృష్ణాజలాలు గండికోటకు వచ్చి దాని ద్వారా జిల్లాకు సాగునీరందుతోందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాంట్లో పల్లె వద్ద జీఎన్ఎస్ఎస్ కాలువ నుంచి రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉప్పలూరులో రైతులు, స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడారు. గండికోటకు వైఎస్సార్ కృష్ణాజలాలను రప్పిస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఉప్పలూరుకు కూడా కృష్ణాజలాలు అందుతున్నాయని తెలిపారు. జగనన్న గండికోటలో 27 టీఎంసీలు నిల్వచేశారని, రైతాంగానికి ఎప్పుడు నీరు అవసరమైనా వదిలి సాగు , తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తున్నామని తెలిపారు. ఉప్పలూరు పరిసర గ్రామాల వాసులు చీనీచెట్లను కాపాడుకోవడానికి చెరువులను నింపాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ద్వారా తనను కోరారని, ప్రస్తుతం 6 చెరువులకు కృష్ణా జలాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. చిన్న చెరువుకు కూడా త్వరలో నీరందిస్తామని ఎంపీ పేర్కొన్నారు. త్వరలోనే మండలంలోని మంగపట్నం, గంగాదేవిపల్లె చెరువుల ఎత్తిపోతల పథకం పనులు జరిగేలా చూస్తామన్నారు.

● జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు బూటకపు హామీలిచ్చారని, రైతుల కష్టం చంద్రబాబుకు పట్టదన్నారు. గతంలో నాయకులు ఉప్పలూరు అభివృద్ధిని పట్టించుకోలేదని, తాము రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చామని తెలిపారు. లోకేష్ పాదయాత్ర పిచ్చోడి యాత్రలా మారిందన్నారు. దేవగుడి సోదరులు అన్ని పార్టీలూ మారారని, బీజేపీ నుంచి ఆదినారాయణరెడ్డి, టీడీపీ నుంచి భూపేష్‌రెడ్డిలు పోటీచేసి తనమీద గెలవాలని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. అనంతరం రైతులు, అధికారులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యే చెరువులోకి ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు.

● ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ రాష్ట్ర సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముని రాజారెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : జిల్లాకు చెందిన మాజీ సైనికుల నుంచి డిగ్రీ బీఏ (హెచ్ఆర్ఎం)లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఐ.జె. రఘురామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగి 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న మాజీ సైనికులు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిగ్రీ సర్టిఫికెట్ పొందేందుకు జూలై 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు.

డబ్బుల బ్యాగు చోరీ

కడప అర్బన్ : కడప నగరంలో వ్యాపార వర్గానికి చెందిన ఓ మార్వాడి బెల్లంమండి వీధిలో ద్విచక్రవాహనంలో రూ.8 లక్షల మేరకు డబ్బులను తీసుకుని వెళుతుండగా గుర్తు తెలియని దుండగులు కాపుకాచి దోచుకుని వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. బాధితులు ద్విచక్రవాహనం బ్యాగులో వుంచి, ఎక్కడికైనా వెళ్లారా? లేక ఏ దుకాణం దగ్గరికైనా వెళ్లి.. మరలా వెళ్లేలోపు ఈ డబ్బుల బ్యాగ్‌ను తీసుకుని వెళ్లారా అనే అన్ని విధాలుగా విచారణ చేపట్టారు. అలాగే పోలీసులు ఈ సంఘటన నిజంగా జరిగిందా? లేదా? అనే విషయంపై కూడా ఆరా తీస్తున్నారు. సంఘటనపై సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలియజేశారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఈ నెల 30వ తేది ఉదయం 10 గంటలకు నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్‌రాజా బ్యాటరీస్ లిమిటెడ్ కంపెనీలో మిషన్ ఆపరేటర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పురుషులు మాత్రమే అర్హులని సూచించారు. కడపలోని ఎయిల్ డిక్సన్ కంపెనీలో అసెంబుల్ ఆపరేటర్లుగా పని చేసేందుకు మహిళలు అర్హులన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా చదివి 19–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి 11–12 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఫొటోలు తీసుకుని ఈనెల 30వ తేదీన ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

సాగు సంబరం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తొలకరి వర్షాలు పలకరించాయి. అన్నదాతలు ఆనందంతో పొలంబాట పట్టారు. కొందరు దుక్కులు చేసుకుంటున్నారు. మరికొందరు విత్తనాలు వేస్తున్నారు. ఇంకొందరు బోర్ల కింద వరినారు వేశారు. మొత్తం మీద పంటల సాగులో రైతులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో పొలాలు కళకళలాడుతున్నాయి. ఈ దృశ్యాలు కమలాపురం మండలంలోని గ్రామాల్లో కనిపించాయి. ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







బాలిక అదృశ్యం


గాయత్రి (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని అక్కాయపల్లి రీజినల్ బాలికల చిల్డ్రన్స్ హోంలో వుంటున్న ఎం.గాయత్రి (9) అనే బాలిక కనిపించడం లేదని ప్రిన్సిపాల్ శోభారాణి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ వారు గతంలో వీధి బాలబాలికల కోసం వెతుకుతూ ఈ బాలికను తీసుకుని వచ్చి చిల్డ్రన్ హోంలో సంరక్షణలో వుంచారు. ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఎస్ఐ రామకృష్ణ తెలియజేశారు.

లైంగిక వేధింపుల కేసులో జైలు

పెండ్లిమర్రి : మండలంలోని ఉలవలపల్లె గ్రామానికి చెందిన ప్రహ్లాదుడికి.. ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో జైలు శిక్ష పడింది. అతనికి కడప ఏడవ అదనపు కోర్టు ఇన్‌చార్జి జడ్జి జి.గీతా రెండు సంవత్సరాలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి పోలీసుస్టేషన్‌లో ఈ కేసు గత ఏడాది జనవరి 7వ తేదీన నమోదు అయింది.

పెప్సీ గోడౌన్‌పై దాడి కేసులో నలుగురి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండాయపల్లి సమీపంలో వున్న పెప్సీ గోడౌన్‌పై ఈ నెల 19న సాయంత్రం కొంత మంది ఆకతాయిలు దాడి చేసిన సంఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో చిన్నచౌక్ సీఐ శ్రీరామ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన జరిగిన రెండు రోజుల్లోనే 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈనెల 27న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం ఈ కేసులో నిందితులైన డిగ్రీ విద్యార్థి కల్లూరు మల్లికార్జునరెడ్డి, అలియాస్ మల్లి, తిలక్‌నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి దండిపోయిన శివ అలియాస్ శివయాదవ్, మరో విద్యార్థి మాసాపేటకు చెందిన మున్నంగి రాజేష్ అలియాస్ మాసాపేట రాజేష్‌లను అరెస్ట్ చేశారు. మరో బాలుడిని ప్రభుత్వ బాలుర గృహంకు తరలించారు. ఈ సంఘటనలో పరారీలో వున్న ప్రధాన నిందితుడు వెంకటేశ్వర్‌నాయుడు, ఓ టివి చానెల్ (సాక్షి కాదు) మాజీ టౌన్ విలేకరి, ఇంకా కొందరు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈ కేసులో నిందితులందరిని అరెస్ట్ చేస్తామనీ కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తెలియజేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

ప్రొద్దుటూరు : పట్టణంలోని శ్రీరామ్‌నగర్ సచివాలయ పరిధిలో బుధవారం బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సూపర్ వైజర్ జి.భాగ్యలక్ష్మి అడ్డుకున్నారు. ఓ మైనర్ బాలికకు స్థానిక బొకరాపేట వీధికి చెందిన గుర్రాల శివకృష్ణతో పెద్దలు ఈ నెల 25న నిశ్చితార్థం చేశారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్త పి.వెంకట సుబ్బమ్మ, మహిళా పోలీసు పి.అరుణ జ్యోతితో కలసి ఇరువురి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహం చట్ట విరుద్ధమని వివరించారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్ వద్ద వారిని హాజరుపరచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివాహ వయసు వచ్చే వరకు వివాహం చేయబోమని ఇరువురి తల్లిదండ్రులు అంగీకరించారు. కార్యక్రమంలో వీఆర్ఓ దావీదు పాల్గొన్నారు.

30న పసుపు కొనుగోళ్ల ముగింపు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పసుపు కొనుగోళ్ల కార్యక్రమం ఈ నెల 30వ తేదీతో ముగుస్తుందని జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి తాడిగొట్ల నరసింహారెడ్డి తెలిపారు. జిల్లాలో ఈ నెల 2వ తేదీ నుంచి పసుపు కొనుగోళ్లను ప్రారంభించి కింట్వాల్‌కు మద్దతు ధరను రూ.6850 కేటాయించిందన్నారు. పసుపు కొనుగోలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు1630 మెట్రిక్ టన్నుల పసుపును 765 మంది రైతులు నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే సుమారు కోటి రుపాయలు రైతుల ఖాతాలకు జయ చేయడం జరిగిందని చెప్పారు. కావున ఇంకా ఎవరైనా పసుపును విక్రయించని రైతులుంటే ఈ నెల 30వ తేదీలోపు విక్రయించుకోవాలని ఆయన తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో బుధవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, కమలాపురం సీఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మరొకరిని వైవీయూ స్క్వాడ్ సభ్యులు డిబార్ చేశారు.

రైతుల సమస్యలపై పోరాడుదాం

రాజుపాళెం : గ్రామ స్థాయి నుంచి రైతు సమస్యలపై తెలుసుకొని వాటి పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు పరిమి వెంకట రాఘవులు అన్నారు. రాజుపాళెం మండలంలోని వెల్లాల గ్రామంలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర సమావేశాలను బుధవారం ప్రారంభించారు. ముందుగా నాగలి, బలరామ దేవుని చిత్ర పటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ కార్యవర్గ సమావేశాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూరీ సర్వే మంచిదే కానీ కింది స్థాయిలో ఆ సర్వే సరైన పద్ధతుల్లో జరగడం లేదని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాలు అమలు కావడం లేదన్నారు. జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి మాట్లాడుతూ రసాయనిక ఎరువులకు ఇచ్చే సబ్సిడీని ప్రకృతి వ్యవసాయం సేంద్రీయ పద్ధతుల్లో పంట సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు పదివేలు అందించాలన్నారు. కడప జిల్లా అధ్యక్షులు ఉమ్మడి సహదేవరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రైతులకు సాగునీటి కష్టాలు తీరాలంటే రాజోలి రిజర్వాయరును ముందుగా అనుకున్న విధంగా నిర్మించాలన్నారు. కుందూనది విస్తీర్ణం వల్ల లక్షలాది ఎకరాల్లో రైతులు భూములు కోల్పోవాల్సి ఉంటుందని, ఆ పనులను ఆపివేసి రాజోలి రిజర్వాయర్ నిర్మాణంపై శ్రద్ధ పెడితే ఉపయోగం ఉంటుందన్నారు. సమావేశంలో బీకేఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుధారాణి, జాతీయ కార్యవర్గ సభ్యులు దోసూరి రాము, శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ మధుసూదన్ రెడ్డి, జిల్లా కోశాధికారి రెడ్డి సుబ్బిరెడ్డి, బాల వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ముక్కమల్ల హరిచంద్రారెడ్డి, రైతు నాయకులు కొట్టాల రంగారెడ్డి, ఆయా జిల్లాల నుంచి వచ్చిన బీకేఎస్ /ల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రాఘవులు

ఘనంగా తాళ్లపాక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


సిద్దేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ పూజలు చేస్తున్న టీటీడీ అర్చకులు


ఏనుగు వాహనం అందజేస్తున్న వెంకటరమణ కుటుంబ సభ్యులు

టీటీడీ ఆధ్వర్యంలో 9 రోజుల పాటు నిర్వహణ

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలిలోని తాళ్లపాక గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ పూజలు నిర్వహించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకస్వాములు, వేదపండితులు అటు చెన్నకేశవ, ఇటు సిద్దేశ్వరస్వామి ఆలయంలో అంకుర్పారణ పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలజీ, టీటీడీ సిబ్బంది, టీటీడీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి..

తాళ్లపాకలోని చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి జూలై 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10గంటలలోపు శివ, కేశవ ఆలయాల్లో ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో స్వామివార్లు రోజుకొక వాహనాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకు టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఏనుగు వాహనం బహూకరణ

తాళ్లపాక ఆలయంలోని శ్రీ సిద్దేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలకు స్థానిక సర్పంచ్ గౌరీశంకర్ సోదరుడు శ్యామలబోయిన వెంకటరమణ ఏనుగు వాహనాన్ని బహూకరించారు. మొదటగా ఈ వాహనాన్ని కొన్నేళ్ల క్రితం వారే తయారు చేయించి ఆలయానికి ఇచ్చారు. అయితే ఈ వాహనం ఉపయోగించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో వెంకటరమణ మళ్లీ రూ.2.40 లక్షలతో ఇత్తడి వాహనాన్ని తయారు చేయించి వేదపండితుల ద్వారా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలా జీకి ఈ వాహనాన్ని అందజేశారు. అంతకుముందు సర్పంచ్ గౌరీశంకర్ కుటుంబ సభ్యులు చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు నరేష్, మహేష్, భక్తవత్సలంతోపాటు గ్రామస్తులు శ్యామనబోయిన మురళీ, గంగయ్య, నాగభూషణం, సుబ్బరాయుడు, రమణయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మెడికల్ అండ్ హెల్త్'లో సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు

కడప రూరల్ : కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో సీనియర్ అసిస్టెంట్స్‌గా పని చేస్తున్న నలుగురు ఉద్యోగులకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో కడప సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న ఏ క్రిష్ణను కడప రిమ్స్ మెడికల్ కాలేజీకి, వైఎస్సార్ జిల్లా లింగాల పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎస్.వెంకటసుబ్బమ్మను కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, అన్నమయ్య జిల్లా రేగల్లు పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎస్ఎమ్ సునీతను కడప సర్వజన ఆసుపత్రికి, అనంతపురం సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న టీ శ్రీనివాస కుమార్‌ను అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పదోన్నతులు ఇచ్చి, పోస్టింగ్‌లు కల్పించారు. ఈ కౌన్సెలింగ్‌లో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సల, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అల్లావుల్లా పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తుతెలియని మహిళ మృతదేహం వుంది. ఆమెను ఈనెల 16న అనారోగ్య కారణాల వలన రిమ్స్‌లో చేర్పించారు. ఆ సమయంలో ఇచ్చిన చిరునామా మేరకు పులివెందుల నగరిగుట్ట, వెంకటేష్ భార్య అలివేలమ్మ(38) అని ఉంది. బుధవారం తెల్లవారుజామున 12:45 సమయంలో మృతి చెందింది. ఆమె ఆచూకీ తెలిసిన బంధువులు తమను నేరుగా సంప్రదించాలని రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు తెలియజేశారు.

మోటారు ట్రాన్స్‌పోర్టు ప్రాంగణం పరిశీలన


మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగాన్ని పరిశీలిస్తున్న కర్నూలు రేంజి డీఐజీ వెంకటేశ్వర్లు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్టు ప్రాంగణాన్ని బుధవారం కర్నూల్ రేంజి ఏపీఎస్పీ బెటాలియన్‌ల–3 డిఐజి సి.హెచ్.వెంకటేశ్వర్లు పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన మూడవ రోజు బెటాలియన్‌లోని దుర్గమ్మ గుడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత మోటార్ ట్రాన్స్‌పోర్టు విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంటు ఎస్.శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంటు కె.ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి.కేశవరెడ్డి, కె.వెంకటరెడ్డి, పి.ఎన్.డి. ప్రసాద్, వి.జయప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎల్‌డీఎం దుర్గాప్రసాద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జీ–20 సదస్సులో భాగంగా భారతీయ రిజర్వుబ్యాంకు ఆలిండియా క్విజ్ ఫర్ స్కూలు చిల్డ్రన్ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని లీడ్ బ్యాంకు మేనేజర్ దుర్గాప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా వైఎస్సార్ జిల్లాలో కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం లీడ్‌బ్యాంకు, కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో కడప బాలికల ఉన్నత పాఠశాలలో పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం వైఎస్సార్ జిల్లాలో జూన్ 21న మండల స్థాయిలో పాఠశాల క్విజ్ పోటలు నిర్వహించామన్నారు. అలాగే మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులకు బుధవారం జిల్లా స్థాయి పోటీ పరీక్ష నిర్వహించామన్నారు. ఇందులో కమలాపురం మండలం నల్లింగాయపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిన విద్యార్థులకు జులై 14న విశాఖలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు యూనియన్ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో జిల్లా జడ్జి


ఆలయంలోని బలిపీఠానికి నమస్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను కడప జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, గర్భాలయంలోని మూల మూర్తులైన సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో వారు కాసేపు సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, ఒంటిమిట్ట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.వి.రమణ, ఎస్ఐ మధుసూదన్‌రావు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి సంబంధించి మే–జూన్ నెల మధ్య హుండీ ఆదాయం రూ.7,52,927 అని ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు తెలిపారు. ఆలయ రంగమండపంలో స్వామి వారి హుండీ కానులకు ఉంచి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు సమక్షంలో టీటీడీ సిబ్బంది లెక్కింపు చేశారు.